నేటి దినపత్రిక
18వ
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,1 అక్టోబర్ 2024


# ఈవీఎం గోడౌన్‌లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఏలూరు,మేజర్‌న్యూస్ : త్రైమాసిక తనిఖీలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్ ను త్రైమాసికంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ పరిశీలించవలసి ఉన్నది.తనిఖిలో భాగంగా, ఈవిఎం గోదాము యొక్క తాళములు, సీసీ కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్‌ను పరిశీలించి అందులో సంతకం చేశారు. కార్యక్ర ములో జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి, టీడీపీ, బిజెపి,కాంగ్రెస్, జనసేన పార్టీల యొక్క ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇద్దరు అనర్హులకు వీఆర్‌ఏ ఉద్యోగాలపై కలెక్టర్‌కు నివేదిక

నర్సాపురం,మేజర్‌న్యూస్ : నరసాపురం మండలంలోని చిట్టవరం,వేములదీవి గ్రామాల్లో ఇద్దరు అనర్హులకు వీఆర్‌ఏ ఉద్యోగాలు ఇచ్చినట్లు పత్రికలో వెలువడింది. దీనిపైజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విచారణకు ఆదేశించారు. తాసిల్దార్‌రాజరాజేశ్వరినిపూర్తి వివరాలు అందజేయవలసిందిగా ఆదేశించారు. సోమవారం నివేదిక పంపించినట్లుతాసిల్దార్ తెలిపారు. రెవిన్యూ రికార్డుల్లో పొందుపరచి ఉన్న వివరాలను స్కాన్ చేసి జిల్లా కలెక్టర్కు పంపించినట్లు ఆమె తెలిపారు.

# నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

## జిల్లాలో 2 లక్షల 64 వేల 966 మందికి రూ.113. 24 కోట్లు సిద్ధం



**ఏలూరు,మేజర్‌న్యూస్** : ఏలూరు జిల్లాలో అక్టోబరు 1వ తేదీ మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 2లక్షల 64 వేల 966 మందికి 113.24 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విచెప్పారు.సోమవారంస్థానిక కలెక్టరేట్‌లో అక్టోబర్ మాసపు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఏలూరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ అక్టోబర్ 1వ తేదీ ఉదయం 6గంటలనుండి ప్రారంభమవుతుందని, గ్రామ, వార్డ్ సచివాలయాలు సిబ్బంది పెన్షన్‌దారుల ఇళ్లకువెళ్లిపెన్షన్లను అందిస్తారన్నారు. 1వ తేదీనే నూరు శాతం పెన్షన్ల పంపిణీకి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశామని, ఇందుకోసం 5,174 మంది సచివాలయ,ఇతర ప్రభుత్వ సిబ్బందిని నియమించడంజరిగిందన్నారు.అనివార్య కారణాలతో ఆగష్టు, 1వ తేదీన పెన్షన్ తీసుకోనివారికి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా సెలవు కావున తిరిగిఅక్టోబర్3వ తేదీన అందించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో అక్టోబర్ 1న మంగళవారం ఉదయం 6.00 గంటలకు పెన్షన్‌లు పంపిణీ ప్రారంభించి, పెన్షన్ దారులు అందరికీ మొదటి 4 గంటల లోపు పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఏఒక్క పొరపాటు జరగకుండా పింఛన్లు పంపిణీ జరగాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఏపిడి ఆర్.విజయరాజు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, ఎల్డీయం డి.నీలాద్రి పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం,మేజర్‌న్యూస్:**అక్టోబరు ఒకటవ తేదీ మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు పూర్తి చేయడం జరిగిందనిజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అక్టోబర్ మొదటి తేదీన పింఛన్లను సజావుగా పంపిణీ చేసేందుకు వారి పరిధిలోని లబ్ధిదారుల జాబితా ప్రకారం రూట్‌మ్యాప్‌ను రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా పంపిణీ చేపట్టాలన్నారు. ఎలాంటి గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు పంపిణీకి ముందు రోజే బ్యాంకుల నుంచి నగదును విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచామన్నారు. బయట ప్రాంతాలలో ఉంటున్న లబ్ధిదారులకు ముందుగానే ఫోన్ ద్వారా సిబ్బంది సమాచారాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఉదయం నాలుగు గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టి ఉదయం 10 గంటల్లోపు పూర్తి చేయాలని, సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వారి పరిధిలో కంట్రోల్ రూమ్ లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.



# విద్యతోపాటు సామాజిక, వైజ్ఞానిక విషయాలు చెప్పాలి

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి





**ఉండి,మేజర్‌న్యూస్:** విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, వైజ్ఞానిక విషయాలను తెలియచెప్పాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి తెలిపారు.సోమవారం ఉండి మండలం మహదేవ పట్నంలోని ఉప్పరగూడెం ఎంపీపీ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో క్లాస్ రూమ్‌లు, వంటశాల, పరిసరాలను జిల్లా కలెక్టరు పరిశీలించారు. వంట పదార్థాల స్టాకు, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి వంట పదార్థాలను రుచి చూశారు. భోజనం సమయానికి పెడుతున్నారా, ఆహార పదార్థాలు రుచిగా ఉంటున్నాయా అని కలెక్టరు ఆరాతీశారు. బాగుంటున్నా యని విద్యార్థులు బదులు ఇవ్వడం జరిగింది. క్లాస్ రూమ్ కి వెళ్ళి ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు, అర్థం అవుతుందా అని అడిగి, కొన్ని ప్రశ్నలు వేసి జిల్లా కలెక్టరు సమాధానం రాబట్టారు. బాగా చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాలలో ఏటువంటి ఇబ్బందులు ఉన్నను తక్షణం ఉన్నతాధికారులకు తెలియజేయాలని, అప్పుడే సమస్యను పరిష్కారం చేయుటకు అవకాశం కలుగుతుందన్నారు. పాఠశాల గార్డెన్ నిర్వహణ, మధ్యాహ్నం భోజనం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

అనంతరం అంగనవాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఎంతమంది చిన్నారులు వస్తున్నారు. వారికి ఆహారం మెనూ ప్రకారం అందజేస్తున్నారా అని ప్రశ్నించారు. చిన్నారులకు కొన్ని వస్తువులు చూపించి వాటి పేర్లను చెప్పించడం జరిగింది. అనంతరం ఆ గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను పంచాయతీ బండి వచ్చినప్పుడు అప్పగించాలని ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని సూచించారు. పాఠశాల తనిఖీ సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిదిండి రవికుమార్ వర్మ, ఉపాధ్యాయురాలు బొక్కా సుమలత, స్థానికనాయకులు సీతారామరాజు,వీఆర్వోచిన్నారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నందన్, పంచాయతీ సెక్రటరీ, తదితరులు ఉన్నారు.

# ఖరీఫ్ సీజన్‌కు ఈ పంట నమోదు తప్పనిసరి



**ఉండి,మేజర్‌న్యూస్:** ఖరీఫ్ ఈ-పంట నమోదును క్షేత్రస్థాయి తనిఖీలతో తప్పులు సరిదిద్దే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉండి మండలం పాందువ్వ, ఉప్పులూరు, మహాదేవపట్నంలలో ఈ-పంట నమోదు చేసిన సాగుదారుల వరి పంటలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సంబంధిత యాప్ నందు నమోదు చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ-పంట నమోదును రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయడం జరిగిందన్నారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాల నమోదుతోనే పంటసాయం, పంటల భీమా, తదితర ప్రభుత్వ పథకాలు అందజేయడానికి వీలవుతుందని, ఇందుకు ఇ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఈ-పంట నమోదు అయిన సాగుదారులు పాందువ్వ లో దవిలి నాగరాజు, ఉప్పులూరులో నిమ్మల చెన్నకేశవరావు, ఓదూరి శ్రీనివాసరావు, మహదేవపట్నం వేగేశ్న సీతారామరాజు,చింతా లక్ష్మీనారాయణ వరి పంట పొలాలను జియో ఫెన్సింగ్‌తో క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ సూపర్ చెక్ చేయడం జరిగింది.ఈ-పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,వివరాలతో సరిపోల్చి సంబంధిత యాప్ నందు పొలం వద్ద నుండే యాప్ నందు అప్లోడ్ చేసి పంపడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు, వ్యవసాయశాఖ ఏడి కె.ఏ.ఎస్.ఎస్ శ్రీనివాసరావు, ఏవో సంధ్య, విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వో, కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కాల్ మనీ బాధితులకు న్యాయం చేయండి





ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు,మేజర్‌న్యూస్:**కాల్‌మనీ బాధితులందరికీ అన్నివిధాలా అండగా ఉంటామని, ఎవరూ డబ్బులు కట్టాల్సిన అవసరంలేదని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. కాల్ మనీ బాధితులతో కలసి ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆయన వారి సమస్యలను ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా అధిక వడ్డీలతో పేదలను ఇబ్బంది పెడుతోన్న వడ్డీ వ్యాపారస్తులను ఉక్కుపాదంతో అణచివేయాలనిఎస్పీకి సూచించినట్లు తెలిపారు .ఏలూరులో కలకలం సృష్టించిన కాల్ మనీ వ్యవహారంపై ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక దృష్టి సారించారు. బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలను ముమ్మరం చేశారు. గత ఆదివారం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసిన బాధితులు వారి సమస్యను తెలియజేశారు. ఈ సందర్భంగా అండగా ఉంటానని, న్యాయం చేస్తానని వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వారికిచ్చిన హామీ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయానికి బాధితులతో కలసి వచ్చిన ఆయన ఎస్పీ ప్రతాప శివకిషోర్ దృష్టికి కాల్ మనీ వ్యవహారాన్ని తీసుకెళ్ళారు. బాధితులు తీసుకొచ్చిన అన్ని ఆధారాలను ఎస్పీకి అందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ కార్యాలయం ముందు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కాల్ మనీ వ్యవహారంలో ఇబ్బందిపడుతోన్న బాధితుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని, ఎవరికి, ఎలాంటి అన్యాయం జరిగిందనే పూర్తివిషయాలను ఆధారాలతో తెలియజేశా మన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల, రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని వడ్డీ వ్యాపారస్తులు రెచ్చిపోయి, పేదలను ఇబ్బందిపెట్టారన్నారు. కొంతమంది పేదలపై కోర్టుల్లో కేసులు కూడా వేశారని, తన లీగల్ సెల్ ద్వారా బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, ఇళ్ళకు వచ్చి బెదిరించినా వెంటనే తెలియజేయాలన్నారు. ఏలూరులో అధిక వడ్డీల పేరుతో వేధించేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలని ఎస్పీకి సూచించినట్లు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. కాల్ మనీ బాధితులకు అన్ని విధాలా తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నాయకులు అమరావతి అశోక్, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

# అర్జీలకు నాణ్యమైన, స్పష్టమైన పరిష్కారం చూపాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ 'పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్'లో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఓ డి.పుష్పమణి, ఆర్డిఓ ఎన్ఎస్ కెఖాజావలి,డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు, యం.ముక్కంటిలతో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రజల నుంచి 271 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీలపరిష్కారంలో ఎటువంటినిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీతకాల వ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.


– **దివ్యాంగులవద్దకే కలెక్టర్**.. పీజీఆర్ఎస్ వేదిక వద్దకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగులను కిందనే ప్రత్యేకంగా వీల్ చైర్ లో కూర్చోబెట్టి వారి వద్దకే కలెక్టర్ వచ్చి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. దివ్యాంగులమని నిరుత్సాహపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు.

**అందిన అర్జీలలో కొన్ని**...తంగెళ్లమూడికి చెందిన చొదిమెళ్ల బాలకృష్ణ తమ ఇంటిస్థలం ఆక్రమణకు గురౌతుందని ఆ స్థలానికి సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణను తొలగించాలని కోరుతూ అర్జీ అందజేశారు. పెదపాడు మండలం కలపర్రు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఫిషర్ మేనే సొసైటీని రద్దుపరచి రెవిన్యూ అధికారి వారిచే దర్యాప్తు చేయించి చెరువును కాపాడవల్సిందిగా అర్జీని అందజేశారు. వంగూరు గ్రామానికి చెందిన చలసాని వెంకట సంపత్‌కుమార్ తమ కుమారునికి తాతగారు వీలునామ వ్రాసివున్న దానిప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయం లో ఆన్ లైన్ చేయించవల్సిందిగా అర్జీ అందజేశారు.

చింతలపూడి మండలం తీగలవంచ కు చెందిన వెంకటేశ్వరరావు తమ భూమిని ఆన్ లైన్ మరియు అడంగళ్ నందు నమోదు చేయాలని అర్జీ అందజేశారు. అదే విధంగా హౌసింగ్, ఫీజు రియింబర్స్ మెంట్, పోలీస్ కేసులు, భూమి తగాదాలు, తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ ఏవో నాంచారయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్‌ను విధుల్లోకి తీసుకోపోతే ఉద్యమం తీవ్రతరం





## రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ

**టీ.నర్సాపురం,మేజర్‌న్యూస్:** ఆశ వర్కర్ లక్ష్మి మంగను విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరమవుతుందని రాష్ట్ర ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు పోశమ్మఅన్నారు.సోమవారంఆమె టీ.నర్సాపురంలో జరుగుతున్న ఆశ వర్కర్ల ఐదవరోజు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ సరైన కారణం లేకుండా టీ నర్సాపురంలోని గండిగూడెం ఆశ వర్కర్ లక్ష్మి మంగను విధులను తొలగించడం అన్యాయం అన్నారు. ఈ విషయంలో కొంతమంది రాజకీయ నాయకులహస్తంఉందని ఆమె అన్నారు.నెలవారి మీటింగ్ అని చెప్పి సర్పంచ్ తోనూ, సెక్రటరీ తోను సంతకాలు చేయించుకుని ఆ కాగితాలను లక్ష్మీ మంగ ఉద్యోగం తీసివేయుటకు ఉపయోగించారన్నారు. ఈ విషయంపై టీ.నర్సాపురం మెడికల్ ఆఫీసర్ మమ్ములను తప్పుదోవ పట్టించిందని కార్యదర్శి,సర్పంచులు లిఖిత పూర్వకంగా తెలియజేశారని అన్నారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ఆశవర్కర్‌లక్ష్మి మంగను మానసికంగా వేధిస్తున్న ఎమ్మెల్ హెచ్‌పి నాగబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. అధికారులు తక్షణమే స్పందించాలని లక్ష్మీ మంగనువిధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్ హెచ్‌పి నాగబాబును సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.ఈకార్యక్రమంలో మండలంతో పాటు జిల్లాలోని పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**పెనుగొండ,మేజర్‌న్యూస్:** గర్భిణులు,బాలింతలు క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని పెనుగొండ సర్పంచ్ నక్క శ్యామల సోని శాస్త్రి అన్నారు.పెనుగొండ 1 సచివాలయ పరిధిలోని రైతుభరోసా కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.విజయ కుమారి పోషకాహారం యొక్క ఆవశ్యకతను, వాటిలో ఉండే పోషకాలను తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. అన్ని రకాల పోషక పదార్థాలను తీసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు తప్పని సరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.డ్వాక్రా సిసి టి.శేషా రత్నం, కార్యదర్శి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



**భీమవరం,మేజర్‌న్యూస్:**జిల్లాలో ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ పరీక్షల (టెట్) నిర్వహణకు అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం డిఆర్‌ఓ ఛాంబర్ నందు విద్యా, పోలీస్, రెవిన్యూ, ఎలక్ట్రికల్, మెడికల్ అండ్ హెల్త్, మున్సిపల్, ఏపీఎస్ ఆర్టీసీ, తదితర శాఖలతో టెట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డిఆర్‌ఓ జె.ఉదయభాస్కర్‌రావు సమీక్షించారు.ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ అక్టోబరు 3వ తేదీ నుండి 21 వరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఏపీ టెట్ పరీక్ష కు జిల్లాలో మూడు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, భీమవరం డిఎన్‌ఆర్ కాలేజ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, డిఎన్‌ఆర్ ఆటోనమస్, తాడేపల్లి గూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ యందు పరీక్షలు ఆన్లైన్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కాలేజీలలో అక్టోబర్ 5,6,7,13,19,20తేదీల్లో టెట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ పరీక్షలకు జిల్లా నుండి 2,617 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, మార్నింగ్ సెషన్ ఉ.9.00 గంటల నుండి మ.12.00 గంటల వరకు, ఆఫటర్నూన్ సెషన్ మ.2.30 గంటల నుండి సా.5.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో డీఈవో జి.నాగమణి, విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎం.సత్యనారాయణ, డి.ఎంఅండ్‌హెచ్‌ఓ డా.డి.మహేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గూడెం జనసైనికులు



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** శాసనసభ్యులకు బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాలతో తాడేపల్లిగూడెం మల్లేశ్వర స్వామి సన్నిధిలో జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 3 వ తారీకు వరకు జరగబోయే కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం బస్ స్టాండ్ దగ్గర ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గుడిని శుభ్రం చేసి కడిగి, ముగ్గులను ఉంచి, దీపాలు వెలిగించి, గోవింద నామ సంకీర్తనతో వెంకటేశ్వరుని స్మరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం, తాడేపల్లిగూడెం పట్టన ప్రధాన కార్యదర్శి గుండెమొగుల సురేష్, ఉభయగోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ మధులత కసిరెడ్డి, పైబోయిన చిన వెంకట్రామయ్య మద్దాల మణికుమార్, అడబల కిశోర్, బయణపాలేపు ముఖేశ్, మాజీ కౌన్సిలర్ అడపా జమున, భారతి, రాణి,లక్ష్మీ, కృష్ణ వేణి, నాగమణి తదితరులు భాగస్వామ్యం అయ్యారు.

# లబ్ధిదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించాలి -ఆర్డీవో రాజు



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** మీకోసంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఆ సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని ఆర్డీవో దాసి రాజు అధికారులను కోరారు. సోమవారం మీకోసం లో లబ్ధిదారుల నుండి వినతి పత్రాలను స్వీ కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ మండల స్థాయి అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, దరఖాస్తు వారం రోజుల్లోపు పరిష్కరించేలాగా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారుల నుండి వచ్చిన ఫిర్యాదులను లోతుగా పరిశీలన చేసి పరిష్కారం చూపాలని, వారినుండి లెటర్ కూడా తీసుకోవాలని అన్నారు. మీకోసం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని కొనసాగిస్తుందని ఆయన అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిర్యాదులను వాయిదా వేయకుండాస కాలంలో పరిష్కరించాలని ఆయన అన్నారు.

# ఉన్నత పాఠశాలలో నైపుణ్య అభివృద్ధి కోర్సుల ఏర్పాటు



వేలేరుపాడు,మేజర్‌న్యూస్ : జాతీయ నైపుణ్య అభివృద్ధి కోర్సులను వేలేరుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని సంబంధిత అధికారి పి.వెంకట కృష్ణ తెలిపారు.టైలరింగ్,ఎలక్ట్రానిక్స్,ఫిట్టర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఇంచార్జి హెచ్ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల వలన విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థిక దిశానిర్దేశం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీ,రమేష్,వెంకట లక్ష్మీ,తులసి తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసిత - స్థానిక గిరిజనుల మధ్య భూ వివాదం




**భూ సమస్యను పరిష్కరించండి జీవనోపాధి లేక అల్లాడుతున్నాం**

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** తమకు అప్పగించిన భూ సమస్యలను పరిష్కరించండి జీవనోపాధి లేక అల్లాడుతున్నాం అంటూ కొరుటూరు, టేకూరు నిర్వాసిత గిరిజనలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద అప్పగించిన భూములలో సోమవారం స్థానిక గిరిజనులవలన భూ వివాదం చోటుచేసుకుంది. నిర్వాసితుల తెలిపిన ప్రకారం పోలవరం నిర్వసిత గ్రామమైన కొరుటూరు టేకూరు గ్రామస్తులకు ప్రభుత్వం సర్వే నెం 221,222,223,224,225 వగైరాలో 280 ఎకరాలు ప్రభుత్వం భూమికి భూమి పంపిణీ చేసి ఆన్లైన్లో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలను అందించి పొజిషన్ చూపించారు. అయితే ఈ భూమిపై తమకే హక్కులు ఉన్నాయని, గత కొన్ని ఏళ్లుగా ఆ భూమిని తామే సాగు చేస్తున్నామని, అయినా అధికారులు నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేశారని ఇది అక్రమం అంటూ స్థానిక గిరిజనులు తమ భూములకు అడ్డుపడుతున్నారని తెలిపారు. స్థానిక గిరిజనులు మాత్రం తమకున్న హక్కుతో కోర్టును ఆశ్రయించగా హైకోర్టు తమకే చెల్లుతుందని ఆర్డర్ ఇచ్చినట్లు స్థానిక గిరిజనులు అధికారుల ముందు వాపోతున్నారు. అయితే నిర్వాసితులకు ఇచ్చిన భూమిలోకి వచ్చి పామాయిల్ మొక్కలను పీకి వేసి, డ్రిప్పు పైపులను నరికి వేయడంతో వివాదం మళ్లీ మొదలైంది. ఈ సంఘటనపై సోమవారం స్థానిక తాసిల్దార్ సందీప్ గౌడ్, కుకునూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, జీలుగుమిల్లి ఎస్ఐ. పి. నవీన్ కుమార్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో చర్చలు జరిపారు. స్థానిక గిరిజనులకు ఉన్నా హక్కు పత్రాలు ఏమైనా ఉంటే తీసుకొని మంగళవారం తాసిల్దార్ కార్యాలయానికి రావాలని సూచించడంతో అంగీకరించిన స్థానిక గిరిజనులు వెనుతిరిగి వెళ్ళిపోయారు. పంటను పాడు చేస్తారని వచ్చిన గిరిజనుల వెను తిరగడంతో ప్రభుత్వ యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

**నిర్వాసితుల ఆవేదన వర్ణాతీతం:** తమకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని మరిచి వివాదంలో ఉన్న భూమిని కట్టబెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడూ తాము పంట వేయడం స్థానిక గిరిజనులు వచ్చి పంటను నాశనం చేయడం తాము లక్షల్లో నష్టపోవడం పరిపాటిగా మారిపోయింద అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం స్థానిక గిరిజనులు తమ పంటలను ధ్వంసం చేసి పామ్ ఆయిల్ మొక్కలు పీకేసి మెయిన్ పైపులను డ్రిప్పు పైపులను నరికి వేయడంతో మళ్లీ లక్షల ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడు తాము నష్టపోయిన నష్టాన్ని ఏ అధికారి భర్తీ చేయకపోగా స్థానిక గిరిజనులతో వివాదాలు పెరుగుతున్నాయని అంటున్నారు. తాము ఈ భూములను అప్పగించి తమ సొంత గ్రామానికి తిరిగి వెళ్ళిపోతామని అధికారులు మాయందు దయఉంచాలని ఆవేదనతో వేడుకుంటున్నారు. పంట నష్టపోయిన రైతులలో బరగడ వెంకటేష్ మూలం పోసి బాబు మూలం చెల్లాయమ్మ బరగడ వెంకటలక్ష్మి మూలం ఈశ్వరి తదితరులు ఉన్నారు. ఈకార్యక్రమంలో విఆర్వోముత్యం, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర రావు పోలీస్ సిబ్బంది నిర్వాసిత గిరిజనులు పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్టు ఉదయభాస్కర్‌కు సత్కారం



యలమంచిలి,మేజర్‌న్యూస్: మండలంలోపెదలంక గ్రామం నందు ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత గుమ్ములూరి ఉదయ భాస్కర్‌ను పెదలంక గ్రామ సర్పంచి, ప్రముఖ న్యాయవాది తాళ్ల నాగరాజు ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జర్నలిజం పవిత్రమైన వృత్తని, ఉదయ భాస్కర్ 30 సంవత్సరాల నుండి విలువలతో కూడిన పాత్రికేయునిగా పలువురి ప్రశంసలు పొందారని, ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన అవార్డు ఇచ్చి సత్కరించడం , జర్నలిజానికి మరింత విలువ పెరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో పెదలంక, కనకాయలంక గ్రామ నాయకులు ముసుకూడి రాంబాబు తెలుగుదేశం నాయకులుపులి శ్రీరామ్ మూర్తి కనకాలంక మాజీ సర్పంచ్ కడలి సత్యనారాయణ బండాడ బుజ్జి నెల్లి ఆనందరావు ఏలంగి శేషగిరి కుక్కల ముసలయ్య వడ్డీ బాల నీటి పూడి రాజు నీతి పూడి సత్యనారాయణ కత్తి మండ ప్రసాదు నీటి పూడి నీతి పూడి నీతి పూడిరాజేష్ మండల వెంకటేశ్వరరావు ఆకుమర్తి శ్రీను కర్రి ఏడుకొండలు వీఆర్వో లక్ష్మి మహిళ పోలీస్ కే సుజన కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో సత్య షోరూం ప్రారంభం




**ఏలూరు,మేజర్‌న్యూస్:** సత్య షోరూం ద్వారా వినియోగదారులకు నిర్ణీత సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని, ఏలూరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్య షోరూం నిర్వాహకులు సురేష్ తెలిపారు. సోమవారం ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద నూతనంగా ఆంధ్రప్రదేశ్లో 36వ బ్రాంచ్ ను సత్య షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సత్యకు తమిళనాడులో 250 బ్రాంచీలు ఉన్నాయని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్లో ఏలూరు తో సహా 36 బ్రాంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే భీమవరం,తూర్పుగోదావరి ప్రాంతాల్లో మరికొన్ని బ్రాంచీలు ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులకు 30వేల రూపాయల వస్తువుకొన్న వారికిగోల్డ్ కాయిన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. దసరా పండుగ సందర్భంగా 3వ తారీకు నుంచి ఈ ఆఫర్లు ప్రజలందరికీ అందుబాటులో ఉంటాయని, ప్రతి అమ్మకానికి ఒక గిఫ్ట్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం గోపి, సత్య ఏజెన్సీ స్టేట్ హెడ్ సెంథిల్, సీనియర్ డిజన్ ఆనంద్, ప్రముఖ బ్రాండ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చవాకుల నరేష్‌కు డాక్టరేట్



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** తమిళనాడులోనీ హొసూరు పట్టణంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు పాలకొల్లు చవాకుల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చవాకుల సూర్య నరేష్ బాబుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు, ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఇకపై మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని అన్నారు, యూనివర్సిటీ అవార్డు ప్రధానం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు, నరేష్ కు అవార్డు రావడం పట్ల పట్టణ ప్రముఖులు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి, బంగారు ఉషారాణి, గుణ్ణం నాగబాబు, చేగొండి సూర్య ప్రకాష్, బొణం చినబాబు, మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ, పలువురు పట్టణ పెద్దలు అభినందనలు తెలిపారు,

# ప్రగతి పత్రాలు అందజేత



**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** జి.వి.ఎస్.వి ఆర్.ఎం. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల యందు పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం ప్రధానోపాధ్యాయులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులును ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు,అభ్యసన కృత్యాలపై ఉపాధ్యాయుల దృష్టి, స్వచ్ఛతహిపక్వాడ కార్యక్రమాలపై తల్లిదండ్రులు అవగాహన, పాఠశాల పరిశుభ్రత పై వివరణ, మొదలైన అంశాలపై తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. స్వర్ణాంధ్ర 2047 విజిల్ ఫర్ ఐడియాస్ గూర్చి వివరించి, దానికి సంబంధించిన వివరాలను తెలిపి, ఆన్లైన్లో ఎంటర్ చేసి స్వర్ణాంధ్ర 2047 సర్టిఫికెట్ పొందాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులచే ప్రగతి పత్రాలు అందజేశారు.

# కాలేజీ బస్సుల్లో వెళ్ళే విద్యార్థులకు భద్రత ఉందా?

## అపరిమితంగా ఎక్కించుకుంటే జరిగే ప్రమాదాలకు బాధ్యులెవరు?




**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుపుతున్న కాలేజీ బస్సులు,స్కూలు బస్సుల గురించి, వారి భద్రత గురించి పలువురు ఆందోళన చెబుతున్నారు. లెక్కకు మించి విద్యార్థులను ఎక్కించుకొని కాలేజీ బస్సులు ఎక్కువగా వెళుతున్నాయి. విద్యార్థులు లోపల ఉండి అరుపులు, కేకలు, ఆనందో త్సాహలతో లోపల గంతులేస్తున్నా,డోర్ దగ్గరకు వచ్చి నిలబడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బస్సు డ్రైవర్లు వారిని నియంత్రించడం లేదు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడంతో కూడా ఈ పరిస్థితి నెలకొంది. సోమవారం స్థానిక వసంత మహల్ సెంటర్లో శ్రీ చైతన్య కాలేజీ బస్సు లో పరిమితికి మించి విద్యార్థులు ఎక్కడంతో విద్యార్థులు ఫుట్ రెస్ట్ మీద నిలబడి ఉన్న దృశ్యం కనిపించింది. దాదాపుగా అనేక బస్సుల్లో ఈ విధంగా జరుగుతోంది. అటు కాలేజీ ఇలా స్కూళ్ల యాజమాన్యాలు గానీ, రవాణా శాఖ అధికారులు కానీ, ట్రాఫిక్ పోలీసులు కానీ స్పందించిఇటువంటి చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటల నుండి ఒకేసారి అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకొని వెళ్ళు తుంటాయి. ఏలూరు కొత్త బస్టాండ్ నుండి ఓవర్ బ్రిడ్జి వరకు విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కనిపిస్తోంది. ఇది ప్రతినిత్యం జరిగే కార్యక్రమం. కాలేజీ లన్నీ ఒకేసారి విద్యార్థులను వదిలేయకుండా ఒక్కొక్క కాలేజీకి పది నిమిషాలు సమయం కేటాయిస్తే, ట్రాఫిక్ రద్దీ లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. అంతేకాకుండా బస్సుల్లో అపరిమితంగా విద్యార్థులను ఎక్కించుకుంటే ,వారు బయట డో ర్ దగ్గర నిలబడి ఉంటే, ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే నష్టం ఎవరికి? కనుక విద్యాసంస్థలు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకుండా, బస్సులను అధిక స్పీడుతో వెళ్లనీయ కుండా,ఒకేసారి అన్ని కాలేజులు వదిలిపెట్టకుండా చర్యలు తీసుకోవాలి.

### ఏలూరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన యం.అచ్యుత అంబరీష్




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు డివిజన్ ఆర్డిఓగా నియమితులైన యం. అచ్యుత అంబరీష్ సోమవారం ఏలూరు ఆర్డిఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏలూరు డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన యం. అచ్యుత అంబరీష్‌కు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆర్డీవో అచ్యుత అంబరీష్ జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ డి.పుష్పమణిని కలిసి పూల మొక్కలను అందజేశారు.

# అంబేడ్కర్ ఆశయాలు సాధించడం ప్రతీ ఒక్కరి బాధ్యత



ఏలూరు, మేజర్‌న్యూస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏలూరు విచ్చేసి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏలూరు పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు 1944 సెప్టెంబర్ 30న ఏలూరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం అని ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెట్ వెల్ సీఈవో కే ప్రభాకర్,ఆర్ఐవో చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈఈ దేవరకొండ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రాంబాబు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ గిరిబాబు దళిత బహుజన సంఘాల నాయకులు నేతల రమేష్ బాబు,చాగంటి సంజీవ్, గరికిముక్కు వెంకటేశ్వరరావు, దాసరి నాగేంద్ర కుమార్, చొప్పల సాయిబాబు, పళ్ళెం ప్రసాద్, మెండెం సంతోష్ కుమార్, మేతర అజయ్, అబ్బూరి అనీల్,దాసి వెంకటేశ్వర్లు మేడిశెట్టి గిరిబాబు కొత్తల పూర్ణ మల్లికార్జున్ మంచెల్ల ఇసాక్ ఎరికిపాటి విజయ్ కాపుదాసి రవి గొల్ల కిరణ్ మెండెం ఆనంద్ చింతా మహాలక్ష్మణుడు మేరుగు సత్యనారాయణ కుర్మా రాజు కొరబండి బాబురావు కర్నికోటి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడబ్ల్యుడి భూముల్లో గిరిజనేతరుల పేర్లు తొలగించాలి



**పీసా గ్రామసభల షెడ్యూల్ విడుదల చేయాలనీ వినతి**

**ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ డిమాండ్**

**బుట్టాయగూడెం,మేజర్‌న్యూస్:** ఏజెన్సీలోని భూ సమస్యలు పరిష్కరం కోసం అధికారులు ఇరుపక్షాల భూ రికార్డులను టైటిల్ వెరిఫికేషన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది .మండలం లోని కోటరామచంద్రపురం ఐటీడిఏ గ్రీవెన్స్ కార్యక్రమంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై ఐటీడిఏ ఎపిఓపివిఎస్ నాయుడుకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరావు లు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ భూభాగంలో ప్రభుత్వ ఏడబ్ల్యుడి, గయ్యాలు,ప్రభుత్వ పోరంబోకు వంటి భూములు స్థానిక గిరిజనులకే చెందుతాయని అన్నారు. మండలం లోని అంతర్వేదిగూడెం రెవెన్యూ ఇనుమూరు గ్రామ సమీపంలో సుమారు 80 ఎకరాలు ఏడబ్ల్యుడి భూమి దొరమామిడి గ్రామానికి చెందిన గిరిజనేతరులకు అక్రమ పద్ధతిలో వారసత్వంగా చూపిస్తున్నారని ఆరోపించారు. 1994 వరకు ఏడబ్ల్యుడి భూమిగా ఉన్న భూములను గిరిజనేతరులకు ఏ విధంగా వారసత్వం వచ్చిందో రెవిన్యూ అధికారులు స్పష్టం చేయాలని కోరారు. అంతర్వేదిగూడెం రెవిన్యూ గ్రామం కానివారికి దొరమామిడి గిరిజనేతరుల పేరుతో ఉన్న భూ రికార్డులలో వారి పేర్లు తొలగించి స్థానిక ఇనుమూరు గిరిజనుల పేర్లు నమోదు చేసి హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 24వ తేదీ నుండి రాష్ట్రంలో అన్ని ఐటిడిఏ పరిధిలో ఉన్న షెడ్యూల్డ్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించటానికి పిసా, గ్రామ కమిటీలు పునరుద్ధానికి ఉత్తర్వులు జారీ చేసిందని తెలియజేశారు .ఆ ఉత్తర్వులు ప్రకారం ఈనెల 24వ తేదీ నుండి పీసా గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.పీసా గ్రామసభ నిర్వహించడం కోసం ఉన్నత అధికారులు జోక్యం చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో గిరిజనులతో ఐటీడిఏ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం ముత్యాలరావు, కోడిమి లక్ష్మడు,పిఅక్కమ్మ,టీమంగతాయారు,బితేజ,తెల్లం ముత్యాలమ్మ, సి హెచ్‌రాజు, జోడే చంద్రరావు,టీ ముత్యాలరావు, కూరం సీత ,కె వసంత తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి పడేలా పరిష్కరించాలి

**- జాయింట్ కలెక్టర్ రాంకుమార్ రెడ్డి**




**భీమవరం, మేజర్‌న్యూస్:** మీకోసం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత బాధ్యతతో పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు .సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం మీకోసం సమావేశ మందిరంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు, డ్వామా పిడి డా.కె.సి.హెచ్. అప్పారావు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ మీకోసం ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. అర్జీదారుడు అందించిన ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు ఇచ్చిన రిపోర్టును బట్టి అర్జీదారుడు నిరుత్సాహపడకుండా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు. నిర్ణీత గడువు లోపుగా తప్పక పరిష్కారం చూపలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా నలుమూలల నుండి 164 ఫిర్యాదులను అర్జీదారుల నుండి స్వీకరించడం జరిగిందన్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని.. కె.కనకదుర్గ, అత్తిలి మండలం అత్తిలి, గుడితి త్రివేణి, గెడ్డం లక్ష్మి తణుకు మండలం వేల్పూరు, తాడి వెంకటలక్ష్మి పెంటపాడు మండలం రాచర్ల, వందర్ లక్ష్మణ్ ఇరగవరం మండలం పెకెరు గ్రామాల నుండి తాము వికలాంగులుగా జీవిస్తున్నామని మాకు ప్రభుత్వం ద్వారా ఇచ్చిన రేషన్ కార్డు కలిగి ఉన్నాము జీవనోపాధి కష్టం అవుతున్న కారణంగా అంత్యోదయ వచ్చేలా చూడాలని కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ వివరిస్తూ అంత్యోదయ తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని, ఏదైనా వస్తే న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నిత్యావసర సరుకులు ధరలు బాగా పెరిగిపోయినవి అని సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ధరలు నియంత్రించాలని భీమవరం పట్టణం నుండి సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఆర్ .రంగారావు పి. ప్రసాదు ఫిర్యాదులో కోరారు. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామం నుండి తాను ఒంటరినని, గుర్తింపు కార్డు, ఆధార్ కార్డులో వయసు తక్కువగా వేయడం వలన పెన్షన్ రావటం లేదని, అనారోగ్యంతో బాధపడుతున్నాను నా వయసు ఆధార్ కార్డులో సరిచేసి పెన్షన్ వచ్చేలా చూడాలని ఇబ్బసూరి నారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వయా వృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ మేళం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అండర్-19 ఎ.పి.టీమ్‌కు ఎంపికైన సాయి ప్రకాష్



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మండల పరిధి గోపాలపురం గ్రామంలో గల ఎన్.ఆర్.ఐ. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీరింగ్ డేటా సైన్స్ విభాగం రెండవ సంవత్సరం చదువుచున్న విద్యార్థి తాతా సాయి ప్రకాష్ అండర్-19ఎ.పి.టీమ్కు ఎంపికైన్న ట్లు కళాశాల ఛైర్మన్ డా'ఆర్. వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఈ టీమ్ ఈనెల నాలుగవ తేదీన పంజాబ్ రాష్ట్రంలోని మహేరీలి నగరంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో సాయి ప్రకాష్ పాల్గొంటాడని తెలిపారు. ఎంపికైన తాతా సాయి ప్రకాష్‌ను కళాశాల ఛైర్మన్ డా,ఆర్. వెంకట్రావు, ప్రిన్సిపల్ డా,సి. నాగభాస్కర్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డా,ఎన్.వి. సురేంద్ర, విభాధిపతి సి.హెచ్. మురళీకృష్ణ, ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్. మాధవరావు తదితరులు అభినందించారు.

# గోదావరి ఒడ్డున స్వచ్ఛతహి సేవ



**నర్సాపురం, మేజర్‌న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు నరసాపురంలో స్వచ్ఛ హి సేవ కార్యక్రమాలుకొనసాగుతూ ఉన్నాయి. 15 రోజులపాటు పరిసరాలను శుభ్రం చేయటం, చెత్త తొలగించటం, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం తదితర అంశాలను కొనసాగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను కోరాయి. దీనిలో భాగంగా సోమవారం భీమవరం ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ పెన్నాడా విద్యార్థులు పట్టణంలోని వాలందర రేవులో శుభ్రపరిచారు. ప్రిన్సిప్సల్ కొప్పర్తి సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగగా, బీజేపీ కన్వీనర్ మేకల సతీష్ మెరుగుమువ్వల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్వీకి వరల్డ్ బుక్ రికార్డు



పెనుగొండ,మేజర్‌న్యూస్: ఎనుగొండకు చెందిన కవి, కథా,నాటక, నవలా రచయిత ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి వరల్డ్ బుక్ అవార్డు అందు కున్నారు. ఆయన పెనుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ, సాహిత్య రంగంలో చేసిన విశేష కృషిని గుర్తించి జాషువా కళా సమితి, దుగ్గిరాల వారు విజయవాడలో, ఠాగూరు గ్రంథాలయంలో ఈ అవార్డు అందజేశారని అన్నారు. 300 కథలు,300 కవితలు ఎన్నో నాటికలు, వ్యాసాలు, గేయాలు రచించి, 24 పుస్తకాలు ప్రచురించిన మూర్తికి ఈ అవార్డు లభించడం పట్ల డాక్టర్ కె. రామచంద్ర రాజు, డాక్టర్ కె.అన్నపూర్ణ, డాక్టర్ పవన్ కుమార్, పలువురు సాహితీ వేత్తలు తదితరులు అభినందనలు తెలిపారు.